క్లుప్తంగా

వీధి లైట్లు వెలగక ఇబ్బందులు



వెలగని వీధి లైట్

మద్రిపాలెం : జీవీఎంసీ 49వ వార్డు బర్మా కాలనీలో విద్యుత్ లైట్లు వెలగక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతకాలం నుంచి వీధి దీపాలు వెలగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటున్నారు. రాత్రి వేళల్లో చీకటిగా ఉండడంతో మందుబాబులు, ఆకతాయిల ఆగడాలు ఎక్కువగా ఉన్నాయని, అంతేగాక పాములు, పురుగులు వంటి విష జంతువులు ఇళ్లలోకి వస్తున్నాయని వాపోతున్నారు. పలుమార్లు బర్మా కాలనీ సచివాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకుని లైట్లు వేయాలని కోరుతున్నారు.

వైభవంగా సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో బాలభోగం, శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, సామూహిక విష్ణు సహస్రనామార్చన, రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

22న ఉత్తరాంధ్ర కళా జాతర



మాట్లాడుతున్న రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు రమణమూర్తి

సీతంపేట : ఉత్తరాంధ్ర కళలను భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకే ఈ నెల 22న విశాఖలో ఉత్తరాంధ్ర కళా జాతర నిర్వహించనున్నట్టు రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు వి.వి.రమణమూర్తి తెలిపారు. ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా నగరంలోని గురజాడ కళాక్షేత్రంలో సుమారు 2 వేల మంది సమక్షంలో భారీ కళా జాతర నిర్వహిస్తామని తెలిపారు. కళా సంఘాల ప్రతినిధులతో కలిసి శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, హోం మంత్రి వంగలపూడి అనిత, స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ఆచార్య డి.వి.సూర్యారావు, కళాకరులు చిన్నారెడ్డి, విక్రమ్ గౌడ్, చలసాని కృష్ణ ప్రసాద్, ధనుంజయ్, వి.త్రినాథ్, బాదంగీర్ సాయి, వీరరాజు, కొణతాల రాజు, వర్రె నాంచారయ్య, మేడా మస్తాన్ రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ఎన్‌ఎస్‌ఎస్ అధికారికి సత్కారం

మద్దిలపాలెం: జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) జిల్లా ఉత్తమ అధికారిగా ఆగస్టు 15న డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ కళాశాల అధ్యాపకుడు జి.వి.ప్రతాప్ అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో ఆయనను ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, అధ్యాపక బృందం ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు.

80 అడుగుల రోడ్డున్నా...
బస్సు సౌకర్యం కలేనా..?

- జాతీయ రహదారికి సమాంతరంగా విశాలంగా రోడ్డు నిర్మాణం
- అయినా బస్సులు నడపని ఆర్టీసీ యాజమాన్యం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- స్థానికులకు తప్పని ప్రయాణ అవస్థలు



అక్కయ్యపాలెంలో నిర్మించిన 80 అడుగుల రోడ్



ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

సీతంపేట : ఎనభై అడుగుల సువిశాల రహదారి ఉన్నా.., ఆ మార్గంలో ప్రయాణించేందుకు మాత్రం బస్సు సౌకర్యం కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమయ్యారు. ఏళ్లు గడుస్తున్నా వేలాది మంది ప్రయాణికుల వేదనను ఎవరూ పట్టించుకోవడం లేదు. నగరంలో అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్ తెలియని వారెవరూ ఉండరు. జాతీయ రహదారికి సమాంతరంగా నిర్మించిన ఈ రోడ్ దగ్గరి దారి కావడంతో తాటిచెట్లపాలెం, కంచరపాలెం, 104 ఏరియా, మద్రిపాలెం, ఎన్ఏడీ, ఎయిర్‌పోర్టు, గోపాలపట్నం, గాజువాక, పెందుర్తి ప్రాంతాలకు వెళ్లడానికి నిత్యం వేలాది మంది ఈ మార్గాన్ని ఆశ్రయిస్తుంటారు. ఇవే ప్రాంతాలకు హైవేపై ప్రయాణించాలంటే విపరీతమైన వాహనాల రద్దీ, పైగా ఎక్కడపడితే అక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్ పడుతుంటాయి. దీంతో ప్రయాణికుల సమయం వృథా అవుతుంది. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ రోడ్డులో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని స్థానిక ప్రజలు నాయకులకు, అధికారులకు ఎన్నిసార్లు వినతులిచ్చినా ఎవరూ పట్టించుకోలేదు.

వేలాది మందికి ఇబ్బందులు

అక్కయ్యపాలెం నుంచి ప్రారంభమయ్యే 80 అడుగుల రోడ్‌కు ఆనుకుని ఉన్న జీవీఎంసీ 26, 42, 43, 44, 45 వార్డుల్లో సుమారు లక్షకుపైగా జనాభా నివసిస్తున్నారు.

వారిలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారులు, అసంఘటిత రంగ కార్మికులు, రోజు కూలీలు, విద్యార్థులు 10 నుంచి 12 వేల మంది వరకు ఉంటారు. వీరిలో సగం మంది రోజూ బస్సులను, ఆటోలను ఆశ్రయిస్తుంటారు. ఈ మార్గంలో ఏళ్ల తరబడి బస్సు సౌకర్యం లేకపోవడంతో వేలాది మంది ఆటోలను ఆశ్రయిస్తున్నారు. బస్సు ఎక్కాలంటే జాతీయ రహదారిపై అక్కయ్యపాలెం కూడలి వద్దకు వెళ్లాల్సిందే. దూరాభారం కావడంతో చాలా మంది ఆటోలపై ప్రయాణాలు సాగిస్తున్నారు.

పలుమార్లు వినతులిచ్చాం



జీవీఎంసీ 26, 42, 43, 44, 45 వార్డులకు చెందిన వేలాది మంది జనం నిత్యం బస్సుల కోసం అక్కయ్యపాలెం హైవేకు, రైల్వే న్యూ కాలనీ జంక్షన్‌కు వెళ్లాల్సి వస్తోంది. సుమారు కిలోమీటరు దూరంపైనే నడవాల్సి ఉంది. పిల్లలు, వృద్ధులు నడవ లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రజాప్రతినిధులకు, ఆర్టీసీ యాజమాన్యానికి ఎన్నిసార్లు వినతులిచ్చినా ప్రయోజనం లేకపోయింది. ఇప్పటికైనా బస్సు సౌకర్యం కల్పించాలి.

– రాజగిరి సింహాచలం, అక్కయ్యపాలెం

ఇబ్బందులు పడుతున్నాం



శ్రీనివాసనగర్, రామచంద్రానగర్, ముస్లిం తాటిచెట్లపాలెం, రైల్వే న్యూ కాలనీ ప్రాంతాల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు 80 అడుగుల రోడ్‌లో ప్రయాణిస్తుంటారు. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ఈ మార్గంలో బస్సు సౌకర్యం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయిస్తున్నాం. చాలా కాలంగా ఇబ్బంది పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

– వి.సత్యనారాయణ, అక్కయ్యపాలెం

సమయం ఆదా అవుతుంది



అక్కయ్యపాలెం నుంచి బస్సుపై కంచరపాలెం వెళ్లాలంటే జాతీయ రహదారి వద్దకు వెళ్లి బస్సు ఎక్కాలి. పైగా నాలుగు చోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ పడతాయి. పావు గంట ప్రయాణానికి అరగంట సమయం వృథా అవుతోంది. అదే 80 అడుగుల రోడ్‌లో ట్రాఫిక్ తక్కువగా ఉంటుంది. సిగ్నల్స్ సమస్య ఉండదు. ఈ రోడ్‌లో బస్సు సౌకర్యం కల్పిస్తే ప్రయాణికులకు సమయం ఆదా అవుతుంది.

– ఎస్.సూర్యకాంతం, అక్కయ్యపాలెం

సంప్రదాయ కళలను ప్రోత్సహిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రమౌళి

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో భారతీయ సంప్రదాయ కళలను ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి చెప్పారు. మురళీనగర్ వాకర్స్ పార్కులోని క్లబ్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పౌరాణిక పద్య నాటకాల ప్రదర్శన, శాస్త్రీయ, జానపద నృత్యాల్లో ప్రతిభావంతులతో ప్రదర్శనలు ఏర్పాటు చేసి ప్రజలకు వాటి ప్రాధాన్యతను తెలియజేస్తామన్నారు.

ఈ నెల 25న ఉచిత నేత్ర వైద్య శిబిరం, 29న గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం, కవితా గోష్టి, సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం, వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య, పి.చెల్వరాజు, జె.కూర్మారావు, ఏవీ సుబ్బారావు, ఎం.రామకృష్ణ, చొల్లంగి ప్రసాదరావు, జాలీ వాకర్, ఎస్.ప్రకాశరావు పాల్గొన్నారు.

ఏసీఏ కార్యదర్శికి సత్కారం



ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకి అభినందనలు తెలుపుతున్న బీజేపీ నేత పరశురామరాజు

సీతమ్మధార : ఎమ్మెల్యే పి.వి.ఎన్.విష్ణుకుమార్‌రాజు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) జాయింట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సీతమ్మధారలో గల క్యాంపు కార్యాలయంలో శనివారం బీజేపీ అరకు పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరశురామరాజు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పరశురామరాజు మాట్లాడుతూ ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ పటిష్టానికి విష్ణుకుమార్‌రాజు మరింతగా కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇతర దేశాలతో భారత్‌కు సత్సంబంధాలు

సీతంపేట : భారతదేశం ఇతర దేశాలతో సత్సంబంధాలు కలిగి ఉండాల్సిన ఆవశ్యకత ఉందని యూపీఎస్సీ పూర్వ సభ్యులు ఆచార్య కె.ఎస్.చలం అన్నారు. ఏపీయూడబ్ల్యూజే 67వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని 'పొరుగు దేశాల్లో యుద్ధాలు – భారత్‌పై వాటి ప్రభావం' అనే అంశంపై ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఇతర దేశాల్లో సుమారు 2 కోట్ల మంది భారతీయులు ఉన్నారని, వారి ద్వారా జాతీయ ఆదాయంలో సుమారు 4 శాతం సమకూరుతుందని వివరించారు. ఈ నేపథ్యంలో ఆయా దేశాలతో మంచి సంబంధాలు కొనసాగించాలన్నారు. సమావేశంలో ఇస్కాఫ్ అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్, ఐద్వా ప్రతినిధి ప్రియాంక, ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు కె.రాము, ఆర్.రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌లో తగ్గిన వైద్య సేవలు



ఖాళీగా ఉన్న విమ్స్ ఓపీ

ఆరిలోవ: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అమానుష దాడిని వైద్యులు ఖండిస్తూ సంఘీభావం తెలుపుతున్నారు. ఇందులో భాగంగా శనివారం విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కొంతసేపు నిరసన తెలిపారు. ఓపీ నుంచి జాతీయ రహదారి వైపు ప్రధాన ద్వారం వరకు ర్యాలీ చేపట్టి నినాదాలు చేశారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో రోగులు కొందరు తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. దీంతో పాటు ముందుస్తుగా వైద్యులు వైద్య సేవలు బంద్ చేస్తున్నారని తెలియడంతో ఇంకొందరు రోగుల రావడం మానేశారు. దీంతో రోగులు లేక విమ్స్ బోసిపోయింది. ఓపీ, కన్సల్టెన్సీ గదులు ఖాళీగా మిగిలాయి. నిరసన కార్యక్రమం ముగిసిన అనంతరం విమ్స్‌కు వచ్చిన అరకొర రోగులకు వైద్య సేవలు అందించారు.

విషాదం నింపిన.. పోలీసుల నిర్లక్ష్యం

- సెల్ఫ్ యాక్సిడెంట్ ఘటనలో వ్యక్తి మృతి
- కుటుంబ సభ్యులకు కనీస సమాచారమివ్వని ఎంవీపీ పోలీసులు



యింటి వీరవెంకట సత్యనారాయణ(ఫైల్)

ఎంవీపీకాలనీ: యింటి వీర వెంకట సత్యనారాయణ అనే వ్యక్తి సెల్ఫ్ యాక్సిడెంట్ ఘటనలో ఎంవీపీ పోలీసులు వ్యవహరించిన తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. యాక్సిడెంట్ అనంతరం కోమాలోకి వెళ్లిన సత్యనారాయణ రెండు రోజులుగా కేజీహెచ్‌లో మృత్యువుతో పోరాడి శనివారం మృతి చెందాడు. దీనిపై అతడి కుటుంబ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వకపోవడం స్టేషన్ సిబ్బంది నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఘటనకు సంబంధించి వివరాలిలా.. యింటి వీరవెంకట సత్యనారాయణ తగరపువలసలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు కూతుళ్లతో కలిసి మద్దిలపాలెం కేఆర్ఎం కాలనీలో నివసిస్తున్నాడు. ఈ నెల 14వ తేదీ రాత్రి భార్య ఫోన్ చేసి వరలక్ష్మీ వ్రతం సామగ్రి కావాలని చెప్పడంతో.. సత్యనారాయణ 15వ తేదీ తెల్లవారుజామున తన ద్విచక్ర వాహనంపై మిత్రుడిని పెదవాల్తేర్‌లో దింపేసి శివాజీపాలెం మీదుగా ఇంటికి బయలు దేరాడు. అప్పటికే మద్యం తాగి ఉండటంతో శివాజీ పార్కు వద్ద సెల్ఫ్ యాక్సిడెంట్‌కు గురయ్యాడు. అటుగా వెళ్తున్న రాపిడో బాయ్ పోలీసులకు సమాచారమివ్వడంతో అక్కడికి చేరుకున్న ఎంవీపీ పోలీసులు కేజీహెచ్‌కు తరలించి చేతులు దులిపేసుకున్నారు. తీవ్ర గాయాలపాలైన సత్యనారాయణ కోమాలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులకు కనీస సమాచారం అందించకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

మిస్సింగ్ కంప్లయింట్ ఇచ్చినా..

తన భర్త కనిపించడం లేదంటూ సత్యనారాయణ భార్య ఈ నెల 16న ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు కూడా నమోదు చేసిన పోలీసులు సత్యనారాయణ సెల్ఫ్ యాక్సిడెంట్‌పైనా, కేజీహెచ్‌లో కోమాలో ఉండటంపైనా ఆమెకు సమాచారం ఇవ్వకుండా అక్కడి నుంచి పంపించేశారు. సత్యనారాయణ కోసం గాలిస్తున్న కుటుంబ సభ్యులు ఎట్టకేలకు కేజీహెచ్‌లో అతడిని గుర్తించారు. రెండు రోజులుగా మృత్యువుతో పోరాడి చనిపోయినట్లు తెలియడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. శనివారం సాయంత్రం ఎంవీపీ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మృతుడి భార్య, కూతుళ్ల కన్నీటి పర్యంతమైన తీరు అందరినీ వేదనకు గురిచేసింది. పోలీసులు వ్యవహరించిన తీరు అమానవీయమంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఎంవీపీకాలనీ: చినవాల్తేర్ విద్యానగర్ కాలనీకి చెందిన కె.గోవిందరెడ్డి(51) అనే వ్యక్తి అనుమానాస్పద మృతిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. గోవిందరెడ్డి శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో శివాజీపాలెంలోని అత్తారింటికి వెళ్లాడు. రాత్రి 11.30 గంటల సమయంలో గోవిందరెడ్డి భార్య సరోజ చనిపోయి ఉన్న అతడిని తీసుకొని చినవాల్తేర్‌లోని అత్తింటికి వచ్చింది. దీంతో గోవిందరెడ్డి కుటుంబ సభ్యులు ఆందోళన చెందడంతోపాటు అతడి శరీరంపై గాయాలు ఉండటంతో కావాలనే చంపేశారనే అనుమానం వ్యక్తం చేశారు. గోవిందరెడ్డి తండ్రి రాము ఫిర్యాదు చేయడంతో ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షాపుల వద్ద రాఖీల సందడి



రాఖీలు కొనుగోలు చేస్తున్న యువతులు, విద్యార్థులు

సీతమ్మధార : రాఖీ పండగ సందర్భంగా సీతమ్మధారలోని స్టాళ్ల వద్ద యువతులు, మహిళలు కొనుగోలు చేశారు. నక్కవానిపాలెం, బాలయ్య శాస్త్రి లేఅవుట్, గురుద్వార్, సీతమ్మధార ప్రాంతాల్లోని స్టాళ్ల వద్ద చిన్నారులు, యువతులు, మహిళలు రాఖీలు కొనుగోలు చేశారు. విద్యుత్ కాంతుల మధ్య పలు వెరైటీలతో వ్యాపారులు స్టాళ్లు ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్సీ బొత్సకు అభినందనలు



బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్



బొత్స సత్యనారాయణను సత్కరిస్తున్న మురళీకృష్ణారెడ్డి, సంజీవరెడ్డి, రామారెడ్డి

కంచరపాలెం : ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ శుభాకాంక్షలు తెలిపారు. విశాఖలోని ఆయన నివాసంలో బొత్సను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కేఎస్ఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కర్రి మురళీకృష్ణారెడ్డి, వైజాగ్ హోటల్ అసోసియేషన్ ట్రెజరర్ ఎస్.సంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి బొత్సను మర్యాద పూరక్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ఆర్పీపేట యూపీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న వైద్యురాలు శశిప్రియాంక, సిబ్బంది

మద్రిపాలెం : కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచారం దుర్మార్గమైన చర్య అని, ఆ హింసను ఖండిస్తూ శనివారం 53వ వార్డు శివనగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యాధికారిణి ఏంజెలీనాతోపాటు సిబ్బంది నిరసన తెలిపారు. 'నో సేఫ్టీ... నో వర్క్', 'వుయ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వైద్యులకు రక్షణ కల్పించే విధంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. నిరసనలో భాగంగా వైద్య సేవలు అందించలేదని వారు తెలిపారు.

ఆర్పీపేట యూపీహెచ్‌సీలో నిరసన

కంచరపాలెం : వెస్ట్ బెంగాల్‌లో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం ఘటనను నిరసిస్తూ జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట యూపీహెచ్‌సీలో ప్రధాన వైద్యాధికారి మట్టా శశిప్రియాంక నేతృత్వంలో శనివారం వైద్య సేవలు నిలిపివేసి నిరసన తెలిపారు. వైద్యులకు జాతీయ స్థాయి రక్షణ చట్టం తేవాలని, మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి వైద్యులు, వైద్య సిబ్బంది ధర్నా కొనసాగించారు. డాక్టర్ శశి ప్రియాంక మాట్లాడుతూ ఇటీవల వైద్యులపై జరిగిన క్రూరత్వ సంఘటనలు వైద్య వృత్తిని కదిలించాయన్నారు. అనంతరం కంచరపాలెం ఫ్లైఓవర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది భారతి అరుణ, దిలీప్, మహాలక్ష్మి, పైడిరాజు, పూర్ణ, సత్యనారాయణరావు, రత్నం, చిట్టమ్మ, స్వాతి, భారతి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

కులాల మధ్య చిచ్చు పెట్టే వర్గీకరణ వద్దు



సంఘీభావం ప్రకటిస్తున్న దళిత సంఘాల నాయకులు

సీతంపేట : ఎస్సీల వర్గీకరణలో సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇచ్చిందని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళిత మేధావుల సమావేశం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అన్యాయమన్నారు. వర్గీకరణకు ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయమని, కుల సంఘాల సభకు ప్రధాని మోడీ హాజరయ్యారని, మందకృష్ణ మాదిగ ఢిల్లీలో కొందరిని కలిసి ఈ తీర్పు వచ్చేలా ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. ఉప కులాల మధ్య చిచ్చుపెట్టే వర్గీకరణ మాకొద్దు, ఇది కులాలను వ్యతిరేకించే పోరాటం కాదని, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం పోరాటమని పేర్కొన్నారు. మాల మహానాడు కన్వీనర్ బయ్యే మల్లయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఫుల్ బెంచ్ తీర్పు ద్వారా వర్గీకరణ రద్దు చేసే వరకు పోరాటం సాగిస్తామన్నారు. దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు మాట్లాడుతూ అంటరానితనం రూపుమాపడానికి అంబేడ్కర్ ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. మాల మహానాడు కోసం మరలా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో దళిత ప్రజా వేదిక తరపున ఆలీ హేమసుందర్, విదసం రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు, దళిత సంఘాల ప్రతినిధులు ఎం.అప్పలరాజు, పి.సుధాకర్, బొంత శ్యామ్, సోరు సాంబయ్య, రేవి తిరుపతిరావు, అశోక్ అంబేడ్కర్, పడవల చక్రవర్తి తదితరులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

జనావాసాల మధ్య సెల్ టవర్ వద్దు



సెల్ టవర్ ఏర్పాటు చేసిన ఇంటి ముందు స్థానిక మహిళలు



ఆదర్శనగర్‌లో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సెల్ టవర్

ఆరిలోవ: పాత డెయిరీఫారం ప్రాంతం ఆదర్శనగర్‌లోని ఓ ఇంటిపై సెల్ టవర్ ఏర్పాటు వివాదంగా మారింది. సెల్ టవర్ వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెల్ టవర్ మాకొద్దంటూ వ్యతిరేకిస్తున్నారు. ఇక్కడ ఓ ఇంటిపైన ఎయిర్ టెల్ కంపెనీకి చెందిన సెల్ టవర్ ఏర్పాటు చేసుకోవడానికి ఇంటి యజమాని టవర్ నిర్వాహకులతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో కొద్ది రోజులుగా టవర్ నిర్మాణం పనులు జరుగుతున్నాయి.

ఇంటిపైన సెల్ టవర్ ఏర్పాటు చేశారు. దానికి కేబుళ్ల ఆపరేటింగ్ సిస్టం అమర్చాల్సి ఉంది. దీంతో శనివారం స్థానికులు ఆ ఇంటి వద్దకు చేరుకుని సెల్ టవర్ నిర్మాణం పనులు నిలిపేయాలని కోరుతూ ధర్నా చేపట్టారు. సెల్ టవర్ వల్ల నివాసులు అనారోగ్యం పాలవుతామని, రేడియేషన్ సమస్యలకు గురవుతామన్నారు. గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా దీని సమస్యతో అనారోగ్యానికి గురవుతారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సెల్ టవర్ ఇక్కడ ఏర్పాటు చేయవద్దంటూ నినాదాలు చేశారు. పనులు వెంటనే ఆపేయాలని డిమాండ్ చేశారు. లేదంటే స్థానికులం అంతా కలసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఆదర్శ కమ్యూనిస్ట్ రమణమ్మ

మద్దిలపాలెం: ప్రజా సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో, నిజాయితీగా పనిచేసి ఆదర్శ కమ్యూనిస్ట్‌గా కుంచం రమణమ్మ అందరి హృదయాల్లో నిలిచారని సీపీఎం 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు అన్నారు. రమణమ్మ 4వ వర్ధంతి సభను శనివారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రమణమ్మ పోరాటలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో బేగం, పీతల అప్పారావు, అనపర్తి అప్పారావు, కడియం కుమారి, అప్పారావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.